# రాష్ట్ర అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యం

- కరీంనగర్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతా
- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్
- 52వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు ప్రారంభం



52వ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం స్థానిక నాయకులు, ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్, పక్కన మేయర్ యాదగిరి సునీల్‌రావు

కార్పొరేషన్, అక్టోబర్ 7: సీఎం కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక 52వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, కరీంనగర్‌పై ఉన్న ప్రేమతో సీఎం కేసీఆర్ నియోజకవర్గ అభివృద్ధికి వేల కోట్ల నిధులు మంజూరు చేశారని, తొమ్మిదేళ్ల కాలంలో కరీంనగర్‌ను ఎంతో అభివృద్ధి చేశామన్నారు. వేల కోట్ల నిధులతో నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ ప్రజలకు కనిపిస్తున్నాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ హయాంలో కరీంనగర్ అభివృద్ధి గురించి ఏ రోజు కూడా పట్టించుకోలేదని విమర్శించారు. స్వరాష్ట్రంలో కేసీఆర్ సీఎం అయిన తర్వాత నగర రూపురేఖలు మార్చామన్నారు. నగరంలో ఎక్కడా కూడ మట్టి రోడ్డు అనేది కనిపించకుండా చేయాలన్న లక్ష్యంతోనే పని చేస్తున్నామన్నారు. ఇప్పుడు రూ.133 కోట్ల వ్యయంతో నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ప్రజలు రోడ్డు అడిగిన వెంటనే వేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజలు తనను మూడు సార్లు ఆశీర్వదించి గెలిపించారని, వారి రుణం తీర్చుకునే విధంగా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. రోడ్లతో పాటు పర్యాటకంగా కరీంనగర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే కేబుల్ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకువచ్చామని, వచ్చే ఏడాదిలో మానేరు రివర్ ఫ్రంట్ కూడా పూర్తి అవుతుందన్నారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ సంపదను దోచుకునేందుకే కాంగ్రెస్, బీజేపీకి చెందిన ఆంధ్రా నాయకులు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మి ఓటు వేస్తే తెలంగాణ భవిష్యత్ అంధకారం అవుతుందని తెలిపారు. తనకు మరోసారి అవకాశం ఇస్తే కరీంనగర్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ అఖిల్‌ఫిరోజ్, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఒద్యారం సమస్యను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తా

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్



గ్రామస్తులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సుంకె

గంగాధర, అక్టోబర్ 7: మండలంలోని ఒద్యారం గ్రామాన్ని కొత్తపల్లి మండలంలో కలుపాలని గ్రామస్తులు నిరసన దీక్ష చేస్తుండగా శనివారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఒద్యారం గ్రామ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్తులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో భారత జాగృతి రాష్ట్ర కార్యదర్శి బాలసంకుల అనంత రావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నగరంలో శోభాయాత్రగా వస్తున్న మంత్రి గంగుల కమలాకర్, చిత్రంలో మేయర్ సునీల్‌రావు, రాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గౌరిశెట్టి మునీందర్

# పల్లెల్లో ప్రగతి కాంతులు

- మరోసారి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా
- రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్



ముంజంపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రసమయి, జీవీఆర్, జడ్పీటీసీ, సర్పంచ్

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 7: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లెలు ప్రగతి పథంలో ముందుకు సాగుతున్నాయని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మానకొండూర్ మండలం దేవంపల్లి, ముంజంపల్లి గ్రామాల్లో శనివారం ఆయన సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావుతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనతో పాటు పలు పనులను ప్రారంభించారు. కాగా, ముంజంపల్లిలో సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. ప్రతి పక్షాల నాయకులు ఓట్ల కోసం వస్తే ఏం చేస్తారో, ఏం చేయాలో నిలదీయాలన్నారు. గ్రామాల్లో కోతుల బెడద ఉందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. అంతకు ముందు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేపై గ్రామస్తులు పూల వర్షం కురిపిస్తూ, బతుకమ్మలు, బోనాలతో ఘన స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, సర్పంచులు మాధవరం రమ–సంజీవ రావు, ఎంపీటీసీ మాధవరం జానకి–దామోదర్ రావు, ఉప సర్పంచులు పిట్టల కుమార్, శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు, అంబేద్కర్ సంఘం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, గ్రామస్తులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శోభాయమానంగా శోభాయాత్ర



శోభాయాత్రలో నృత్యం చేస్తున్న విదేశీ మహిళలు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 7: ఇస్కాన్ ఆధ్వర్యంలో నగరంలో రాధాశ్రీకృష్ణుడి మందిర నిర్మాణిస్తుండగా, శనివారం శోభాయాత్ర తీశారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి గంగుల కమలాకర్, మేయర్ వై సునీల్ రావు, సీపీ సుబ్బారాయుడు, హరేరామ హరేకృష్ణ ప్రతినిధి నరహరి స్వామి, ఇస్కాన్ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ చౌక్ నుంచి బైపాస్‌లోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ సమీపంలో ఆలయ నిర్మాణ స్థలం వరకు శోభాయాత్ర శోభాయమానంగా సాగింది. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారి రథాన్ని లాగుతూ తీసుకెళ్లారు. భక్తులు, విదేశాల నుంచి హాజరైన ఇస్కాన్ ప్రతినిధులు, శ్రీ కృష్ణ నామాలు పలుకుతూ, నృత్యాలు చేశారు. డప్పు కళాకారులు, కోలాట బృందాల ప్రదర్శనలు కనువిందు చేశాయి.



శ్రీకృష్ణుడి ఆలయ నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమాన్ని తిలకిస్తున్న మంత్రి గంగుల కమలాకర్ కుటుంబసభ్యులు, మహిళలు

# బీఆర్ఎస్‌లో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తాం

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్/కరీంనగర్ రూరల్: అక్టోబర్ 7: బీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కేసీఆర్ భవన్‌లో కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌కు చెందిన బీజేపీ నాయకులు ఎంపీటీసీ పుష్ప–అంజిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పాత క్యాడర్‌ను కాపాడుకుంటూనే, కొత్త క్యాడర్‌కు పార్టీలో సముచిత స్థానాన్ని కల్పిస్తామన్నారు. సమైక్య పాలనలో తాగునీరు లేక కరెంట్ రాక అరిగోస పడ్డ రోజులుండేవన్నారు. కానీ సీఎం కేసీఆర్ పాలనలో రెప్ప పాటు కూడా కరెంట్ పోవడం లేదని, నిత్యం తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. అంతే కాకుండా వేలాది కోట్లు తీసుకువచ్చి రోడ్లు, డ్రైనేజీలు, ఐలాండ్లను నిర్మించామన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. మానేర్ రివర్ ఫ్రంట్ సైతం అందుబాటులోకి వస్తే ఇక్కడ ఉపాధి అవకాశాలు పెరిగి సంపద కూడా పెరుగనుందన్నారు. భవిష్యత్ తరాలకు గొప్ప నగరం అందించాలన్నదే నా సంకల్పమని, ఆ దిశగా కరీంనగర్‌ను అభివృద్ధి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మైలారం అనిల్, తంగళ్లపల్లి అనిల్, దుమ్మటి రాజ్‌కుమార్, బత్తిని శివ, తదితరులు పాల్గొన్నారు.



యువకులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల

# నేడు రెనే దవాఖానలో ఉచిత మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్స

విద్యానగర్, అక్టోబర్ 7: నగరంలోని రెనే దవాఖాన చైర్మన్ ప్రొఫెసర్ డా. బంగారి స్వామి, శ్రీ లక్ష్మీ మహేశ్వర చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం గతంలో లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసిన 10 మందికి ఉచితంగా కీలు మార్పిడి శస్త్ర చికిత్స చేయనున్నట్లు డాక్టర్ బంగారి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రెనే దవాఖానలో సుమారు లక్షా ఎనభై వేల విలువైన ఈ శస్త్ర చికిత్సతో పాటు మందులు ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం తన తల్లి జ్ఞాపకార్థం రెనే హాస్పిటల్, శ్రీలక్ష్మి మహేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పది మంది అర్హులైన పేదలకు ఉచితంగా కీలు మార్పిడి శస్త్ర చికిత్స చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా, సేవా కార్యక్రమాలు చేపడుతున్న డాక్టర్ బంగారి స్వామిని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎన్‌రావు ప్రత్యేక అభినందనలు తెలిపారు.